



# కరపత్రం

SINCE 2014

శనివారం ఏప్రిల్ 12 2025 సంపుటి :0 సంచిక :180 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# ఏపీ నీటి దోపిడిని అడ్డుకోండి..
# కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ





- శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ లైనింగ్ పనులను వేగంగా కొనసాగిస్తోంది.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కెపాసిటీని 1.5 లక్షల క్యూసెక్కుల వరకు పెంచుకుంది.
- లైనింగ్ పూర్తయితే ఎస్సార్ఎంసీ ద్వారా మరిన్ని నీటిని తరలించుకునే వీలుంటుంది.
- కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డు ను 2023 సెప్టెంబర్, 2024 జులైలో లేఖలు రాసినా స్పందన లేదని అసంతృప్తి.

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మరిన్ని నీళ్లు దోచుకునేందుకు ఏపీ లైన్? క్లియర్? చేసుకుంటున్నది. ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్?రెగ్యులేటర్ కెపాసిటీని లక్షన్నర క్యూసెక్కులకు పెంచుకున్న పొరుగు రాష్ట్రం.. దాని కింద నిర్మించిన శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ (ఎస్ఆర్ఎంసీ) ద్వారా పూర్తి స్థాయిలో నీటిని తరలించుకుపోయేందుకు వీలుగా వారం నుంచి లైనింగ్ పనులను స్పీడప్ చేసింది శ్రీశైలం రైట్ మెయిన్‌కెనాల్‌కు ఏపీ చేపడుతున్న లైనింగ్‌పనులను కృష్ణా బోర్డు అడ్డుకోకపోవడంపై తెలంగాణ తీవ్రంగా స్పందించింది. లైనింగ్‌పనులను ఆపాలంటూ ఇప్పటికే 2023 సెప్టెంబర్, 2024 జులైలో రెండు సార్లు ఫిర్యాదు చేసినా బోర్డు స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. లైనింగ్‌పనులను చేపట్టకుండా ఏపీని ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించింది. ఈ మేరకు గురువారం కేఆర్ఎంబీకి ఈఎన్సీ అనిల్‌కుమార్‌లేఖ రాశారు. 1960 సెప్టెంబర్‌తర్వాత చేపట్టిన అన్ని ప్రాజెక్టులకూ ఇన్‌సైడ్ బేసిన్‌అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని బచావత్‌ట్రిబ్యునల్‌అవార్డు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. బచావత్‌ట్రిబ్యునల్‌కూడా కేవలం ఇన్‌సైడ్‌బేసిన్‌ప్రాజెక్టులకే నీటి కేటాయింపులను చేసిందని స్పష్టం చేశారు. శ్రీశైలం కేవలం జలవిద్యుదుత్పత్తి కోసమే నిర్మించారని, ఔట్‌సైడ్ బేసిన్‌కు నీటిని తరలించరాదంటూ ట్రిబ్యునల్‌స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

1976-77 ఒప్పందం ప్రకారం ఓపెన్‌కెనాల్‌ద్వారా చెన్నైకి 1500 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాల కోసం మాత్రమే తరలించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ.. శ్రీశైలం నుంచి పెన్నా బేసిన్‌కు నీటిని తరలించే శ్రీశైలం రైట్‌బ్రాంచ్‌కెనాల్(ఎస్ఆర్‌బీసీ)కి శ్రీకారం చుట్టి.. సీడబ్ల్యూసీ ఆమోదం కోసం పంపిందని గుర్తు చేశారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ భాగమైనందున సీడబ్ల్యూసీకి గానీ, ట్రిబ్యునళ్లముందుగానీ తమ వాదన వినిపించే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఏపీ తన తీరు మార్చుకోకుండా శ్రీశైలం రైట్‌మెయిన్‌కెనాల్‌కు లైనింగ్‌వర్క్‌ను పూర్తి చేసేలా వేగంగా పనులను చేపడుతున్నదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏపీ విభజన చట్టం ప్రకారం అపెక్స్‌కౌన్సిల్‌అనుమతి లేకుండా, కృష్ణా బోర్డు ఆమోదం తెలపకుండా ఏపీ పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపు సామర్థ్యాన్ని పెంచేలా కెనాల్‌కు ఎలాంటి లైనింగ్‌పనులను చేపట్టడానికి అధికారం లేదని స్పష్టం చేశారు. కాబట్టి ఏపీ వెంటనే ఆ పనులను నిలుపుదల

## శ్రీశైలం జల దోపిడి...

### చెన్నై తాగునీటి ముసుగులో ఏపీ కుట్ర


2 లో

- శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ లైనింగ్ పనులను వేగంగా చేపట్టింది.
- లైనింగ్ లేకపోతే కేవలం 44,000 క్యూసెక్కులు మాత్రమే తరలించగలిగేది.
- లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90,000 క్యూసెక్కులు (8 టీఎంసీలు) నీటిని తరలించే అవకాశం ఉంది.
- 2020లో 89,762 క్యూసెక్కుల సామర్థ్యంతో SRMC లైనింగ్ పనుల కోసం జీవో 203 విడుదల (మే 5న).
- ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం

## వేసవి రద్దీ.. తిరుపతికి 14 ప్రత్యేక రైళ్లు.. వివరాలివే..!

- వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.
- తిరుపతి -మచిలీపట్నం- తిరుపతి మధ్య 14 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది


2 లో

### అసెంబ్లీలో కూడా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..
## ఎమ్మెల్సీ కవిత డిమాండ్

హైదరాబాద్ : అసెంబ్లీలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కార్వాన్‌లో పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ యోచనను స్వాగతిస్తున్నాం. పేజి 2లో



## కంచ గచ్చిబౌలి భూ కుంభకోణం సూత్రధారి, పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే : కేటీఆర్




హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూ కుంభకోణం కర్త, కర్మ, క్రియ, సూత్రధారి, పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 15- 16 నెలల్లో డిసెప్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ అనే 3డీ మంత్రతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి బతుకుల్ని నాశనం చేస్తోంది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

దేశానికే అన్నం పెట్టే స్థాయికి చేరుకున్న తెలంగాణ రైతన్న కడుపు మీద కొట్టారు. ప్రజల దృష్టి మరల్చి, భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ ప్రభుత్వం పాల్పడింది. హెచ్‌సీయూలో జరిగిన పర్యావరణ విధ్వంసంపై దేశం మొత్తం నివ్వెర పోయి చూసింది. అక్కడ పర్యావరణ విధ్వంసం, మూగజీవుల ప్రాణాలు మాత్రమే తీయలేదు. హెచ్‌సీయూ పక్కన ఉన్న అటవీ భూములను అడ్డం పెట్టుకుని ఒక అతిపెద్ద ఆర్థిక మోసానికి రేవంత్ ప్రభుత్వం పాల్పడింది. ఇదొక నేరపూరిత కుట్ర. తెలంగాణ ప్రజల పట్ల విశ్వాసఘాతుకం. రాత్రికి రాత్రి బుల్డోజర్లను పెట్టి వందల ఎకరాల్లో చెట్లను కూల్చివేసి మూగ జీవాలకు నిలువ నీడ లేకుండా చేసిన రేవంత్ ప్రభుత్వ ఆరాటం వెనుక పదివేల కోట్ల రూపాయల స్కాం ఉంది. 2 లో

### ఏడాదిన్నర పాలనలో పుష్ప.. హైడ్రా.. మూసీ తప్ప హామీల అమలు లేదు: ఎంపీ అర్వింద్


2 లో

- తెలంగాణలో అసమర్థ, అవినీతి, అసత్య ప్రభుత్వం నడుస్తోందని.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీరో పరిపాలన సాగుతోందని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు.

### కేసీఆర్ ప్రభుత్వం వేల ఎకరాలను తన వారికి కట్టబెట్టింది: మహేశ్‌కుమార్‌గౌడ్

- పదేళ్ల పాలనలో గత భారాస ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు.


2 లో

### ఆర్‌టీఈ అమలుపై అఫిడవిట్ దాఖలు చేయండి.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు



హైదరాబాద్: విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలుపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని సామాజిక కార్యకర్త తాండవ యోగేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పేజి 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఏప్రిల్ 12 2025

# సంపాదకీయం

## అధికారమే భావజాల బాంధవ్యం!

రాజకీయ కసరత్తులకు పురస్కారాలు ఉన్న పక్షంలో స్వర్ణ పతకాన్ని అందుకునేందుకు నితీశ్ కుమార్ నిస్సందేహంగా అందరికంటే ముందంజలో ఉంటారుబీ మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒక దానిలో ఉండేందుకు చంద్రబాబు నాయుడు పోటీ పడతారు. నరేంద్ర మోదీకి నిన్న, మొన్న గట్టి ప్రత్యర్థులుగా ఉన్న ఈ నాయక ద్వయం నేడు ఆయన నమ్మకమైన మిత్రులుగా మారిపోయారు. ఇదొక సమూల మార్పు. పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందేందుకు జనతాదళ్ (యునైటెడ్), తెలుగుదేశం పార్టీలు సంపూర్ణ మద్దతునివ్వడమే అందుకొక తిరుగులేని నిదర్శనం. గత పది నెలల్లో పరిస్థితులు ఎంతగా మారిపోయాయి! జూన్ 2024 నాటి పరిస్థితులను గుర్తు చేసుకోండి. సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. నరేంద్ర మోదీకి మెజారిటీ లభించలేదు. నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు బీజేపీకి అవసరమైన సంఖ్యాధిక్యతను సమకూర్చేందుకు సమ్మతించారు%–%షరతులతోనే సుమా! మరి వారే ఇప్పుడు నరేంద్ర మోదీ ఆధిపత్యాన్ని ఎటువంటి మినహాయింపులు లేకుండా అంగీకరిస్తున్నారు.

అధికార రాజకీయాలలో మనుగడను కాపాడుకునేందుకు సైద్ధాంతిక నిబద్ధతలకు ఎంత సులువుగా తిలోదకాలు ఇవ్వడం జరుగుతుందనేదానికి నితీశ్ కుమార్ రాజకీయమే ఒక తిరుగులేని ఉదాహరణ. నరేంద్ర మోదీ 2013లో భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థిగా జాతీయ రాజకీయాలలోకి ప్రవేశించినప్పుడు ఆయనపై మొట్టమొదట తిరుగుబాటు చేసింది బిహార్ ముఖ్యమంత్రే కాదూ? మోదీ ఉన్నతిని ప్రతిఘటించిన నితీశ్ కుమార్ ఎన్డీఏ నుంచి వైదొలిగారు. ఒక 'మతతత్వ' శక్తికి వ్యతిరేకంగా, దానిని సమర్థంగా అడ్డుకోగల ఒక లౌకికశక్తిగా తనను తాను ఆయన నిలుపుకున్నారు. అయితే 2002 గుజరాత్ మారణ కాండ నాటి నుంచి రగులుతున్న సైద్ధాంతిక ఘర్షణతో పాటు, పెరుగుతున్న వైయక్తిక పోటీ కారణంగానే ఆనాడు ఎన్డీఏ నుంచి నితీశ్ నిష్క్రమించారని చెప్పక తప్పదు. 2013లో 'సద్భావన యాత్ర' సందర్భంగా టోపీ పెట్టుకునేందుకు మోదీ నిరాకరించడంపై నితీశ్ ఇలా ప్రతిస్పందించారు: 'దేశాన్ని పరిపాలించేందుకు ప్రతి ఒక్కరినీ మీతో కలుపుకోవాలి.. అందుకు కొన్ని సందర్భాలలో టోపీ ధరించాల్సి ఉంటుంది... మరికొన్ని సమయాలలో నుదుట తిలకం పెట్టుకోవాల్సి ఉంటుంది.' నితీశ్ అలా తన 'మృదు' రాజకీయ లౌకికవాదాన్ని నిర్వచించారు. మోదీ బ్రాండ్ హిందుత్వ, తన లౌకికవాదం మధ్య వ్యత్యాసాన్ని ఆయన ఆ విధంగా చాటి చెప్పారు.నితీశ్, మోదీ నాయకత్వ శైలులు పరస్పర విరుద్ధ మైనవి. పన్నెండు సంవత్సరాల అనంతరం, ఈ పరస్పర విరుద్ధాల ఘర్షణలో విజేతగా మోదీ వెలుగొందుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిని నిర్మించి, దాని నాయకుడుగా ప్రధానమంత్రి నాయకత్వాన్ని సవాల్ చేసిన నితీశ్ కుమార్ ఇప్పుడు మోదీ దర్బార్‌లో ఒక సామంతుడుగా ఉన్నారు! క్షీణిస్తున్న ఆరోగ్యంతో నిస్సహాయుడైపోయిన నితీశ్ మోదీ మహాశక్తిని కనీసమాత్రంగానైనా ఎదుర్కోలేకపోతున్నారు. అందుకే మోదీకి పూర్తి మద్దతుదారుగా మారిపోయారు. అయితే ముస్లింల సంక్షేమం పట్ల తమ నాయకుడి నిబద్ధతలో ఎటువంటి మార్పులేదని నితీశ్ అనుయాయులు వాదిస్తున్నారు. అయితే ఇవన్నీ పసలేని మాటలే. జనతాదళ్(యు) రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడల్లో ఆ సంక్షేమ సంకల్పాలకు అంతకంతకూ ప్రాధాన్యం తగ్గిపోతోంది. ఇది వాస్తవం. భారతీయ జనతా పార్టీకి నితీశ్ కుమార్ ఒక ఆవశ్యక మిత్రుడు. ఒక ఉపయోగకరమైన రాజకీయ చిహ్నం. వచ్చే నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో తమ బలాన్ని పెంపొందించుకునేందుకు నితీశ్ మద్దతు అవసరం చాలా ఉంది.చంద్రబాబు నాయుడి రాజకీయ పరిణామం భిన్నమైనది. అదొక క్లిష్టమైన అధ్యయన అంశం. బీజేపీకి చెప్పుకోదగిన ప్రజాబలం లేని రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి. పరిపాలనా ప్రజ్ఞ ఉన్న నాయకుడు. రాజకీయ అనుభవమూ అపారంగా ఉన్న నేత. బీజేపీపై ఏ మాత్రం ఆధారపడవలసిన అవసరం లేకుండానే ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో కొనసాగగల సామర్థ్యం చంద్రబాబుకు ఉన్నది. మరి ఇదే నాయకుడు 2019లో నరేంద్ర మోదీపై ధ్వజమెత్తారు. మోదీ నాయకత్వాన్ని వ్యతిరేకించారు. ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రిని ఒక 'ఉగ్రవాది' అని కూడా ఆ చంద్రబాబు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు మొదటి నుంచీ కేంద్రంతో 'ఒప్పందాల ఆధారితమైనవిగానే ఉన్నాయి. 1990ల నాటి సంకీర్ణ రాజకీయాల యుగంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి, వాజపేయి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రధాన మద్దతుదారు, ఆ ప్రభుత్వాలను నిలబెట్టిందీ చంద్రబాబే. ఇప్పుడు అవశేష ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడా కేంద్రంతో ఇప్పుడూ గతంలో వలే ఒక 'ఒప్పందం' కుదుర్చుకున్నారు. ఆర్థిక వనరులు కొరవడిన ఆంధ్రప్రదేశ్‌కు గరిష్ఠ స్థాయిలో ఆర్థిక సహాయమందించాలన్నదే చంద్రబాబు షరతు. ఆ ఆర్థిక తోడ్పాటు కోసమే వివాదాస్పద చట్టం విషయంలోనూ ఆయన కేంద్ర ప్రభుత్వానికి గట్టి దన్నుగా నిలిచారు.నితీశ్, నాయుడు ఇరువురూ ఒక విధంగా రాజకీయ మనుగడను ఒక కళగా రూపొందించారు, సాధన చేస్తున్నారు. సమయానుకూలంగా, రాజకీయ అవసరాలకు తగ్గట్టు అభిప్రాయాలు మార్చుకుని పట్టువిడుపులతో వ్యవహరించడం వల్ల అధికారంలో సుదీర్ఘకాలం కొనసాగడం సుసాధ్యమవుతుందనేది ఇరువురి అనుభవ పాఠం. అయితే నితీశ్, నాయుడి రాజకీయ ఎంపికలు సమకాలీన రాజకీయాలకు ఆధారంగా ఉన్న లౌకిక%–%మతతత్వ విభజనపై ఒక ఇబ్బందికరమైన ప్రశ్నార్థకాన్ని ఉంచుతున్నాయి. దృఢ విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించడం కాకుండా స్వప్రయోజనాలు సాధించుకోవడమే ప్రధానమైపోయిన మన రాజకీయ వ్యవస్థలో నిబిడీకృతంగా ఉన్న కాపట్యాలను అవి బహిర్గతం చేస్తున్నాయి. నిర్వివాదమైన ఒక రాజకీయ సత్యాన్ని ఆ ఇరువురి దృక్పథాలు పునరుద్ఘాటిస్తున్నాయి: 'నిర్దిష్ట అంశాలపై మీ వైఖరి ఏమిటి అనే దానిపై మీ అధికార భవితవ్యం అనేది ఆధారపడి ఉన్నది'. ఈ రాజకీయ ప్రక్రియలో లౌకిక రాజ్యాంగ విలువలు క్రమంగా నిరర్థకమైపోయాయి. ఇండియా కూటమితో ఉన్నప్పుడు 'లౌకికవాది' అయిన నితీశ్ కుమార్ బీజేపీతో చేతులు కలిపిన తరువాత మతతత్వవాది ఎలా అయ్యారు? చంద్రబాబుకూ ఈ ప్రశ్న వర్తిస్తుంది.ఈ నేపథ్యంలో మనకు మిగిలింది అవకాశవాద 'లౌకిక' రాజకీయాలే. సూక్ష్మ తేడాలతో అందరూ ఈ సంకుచిత రాజకీయాలనే అనుసరిస్తున్నారు. అయినా రాజకీయాలలో మత ప్రమేయాన్ని వ్యతిరేకిస్తుంటారు. స్వీయ ప్రయోజనాలకు మతతత్వవాదులతో రాజీ పడేందుకు వెనుకాడరు. అధికార లబ్ధే కదా అందరి పరమ ధ్యేయం! మత ప్రమేయం లేని, మతతత్వ రాజకీయాలను సమయానుకూలంగా సమరీతిలో ఆచరించడాన్ని ఒక కళగా తీర్చిదిద్దడంలో కాంగ్రెస్ పరిపూర్ణత సాధించింది. షాబానో కేసు సందర్భంలో ఇస్లామిక్ ఛాందసవాదుల ఒత్తిళ్లకు లొంగిపోయి, వారు అభిలషించిన విధంగా నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ఆ తరువాత హిందుత్వ వాదులను సానుకూలం చేసుకునేందుకు బాబ్రీ మసీదు గేట్లు తెరిపించింది. పర్యవసానంగా జరిగిందేమిటో మనకు తెలిసిన చరిత్రే. ఇక సోషలిస్టులు, విస్తృత జనతా పరివార్‌కు కాంగ్రెస్ వ్యతిరేకతే ఊపిరి. ఆ జాతీయ రాజకీయ పక్షాన్ని అంత తీవ్రంగా వ్యతిరేకించే ఈ సోషలిస్టులు లౌకిక రాజకీయాలకు నిష్ఠగా నిబద్ధమయ్యారా? కాంగ్రెస్ అధికారంలో లేకుండా చేయడమే వారి లక్ష్యం. అందుకు బీజేపీతో జట్టు కట్టేందుకు సోషలిస్టులు, ఇతర జనతా పరివార్ ఎప్పుడూ వెనుకాడలేదు. ఇక ముందూ వెనుకాడబోరని నిశ్చితంగా చెప్పవచ్చు. ప్రాంతీయ పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే మొదలైనవి గతంలో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వాములుగా ఉన్నాయి. ఎందుకు? కేంద్రంలో అధికారం చెలాయించేందుకే సుమా! వామపక్షాలు మాత్రమే మతోన్మాద రాజకీయాలను స్థిరవైఖరితో

### అసెంబ్లీలో కూడా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

## ఎమ్మెల్సీ కవిత డిమాండ్

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాంక్ బండ్‌పై కాసేపటి క్రితం విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారని తెలిసింది. కానీ పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో కూడా ఏర్పాటు చేయాలి. అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగుతుంది అని కవిత స్పష్టం చేశారు.

తెలంగాణ జాగృతి సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్న సంస్థ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే దీక్ష చేసి అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహాన్ని సాధించుకున్నాం. అసెంబ్లీ పాస్ చేసిన బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి. 42 శాతం రిజర్వేషన్ల సాధన యుద్ధం ఇక్కడ ఆగదు.. ఢిల్లీ వరకు వెళ్తుంది. కులగణన సరిగ్గా జరగలేదని అనేక మంది ఫిర్యాదులు చేశారు. తమ వివరాలు సేకరించలేదని లక్షలాది కుటుంబాలు చెబుతున్నాయి. కాబట్టి కులగణన వివరాలను గ్రామాల వారీగా బహిర్గతం చేయాలి. ఇవన్నీ న్యాయమైన డిమాండ్లు%ొ% ప్రభుత్వం కచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలి అని కవిత పేర్కొన్నారు.

## ఏడాదిన్నర పాలనలో పుష్ప.. హైడ్రా.. మూసీ తప్ప హామీల అమలు లేదు: ఎంపీ అర్వింద్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో అసమర్థ, అవినీతి, అసత్య ప్రభుత్వం నడుస్తోందని.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీరో పరిపాలన సాగుతోందని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో పుష్ప, హైడ్రా, మూసీ, హెచ్‌సీయూ మీద పడ్డారు తప్పితే ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఎంపీ అర్వింద్.. ప్రభుత్వ పరిపాలనా తీరుపై విమర్శలు గుప్పించారు.

"ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, విద్యా భరోసా కార్డు, చేయూత, ఆరోగ్యశ్రీ, లక్ష రూపాయలు, తులం బంగారం.. ఇలా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక తూము కట్టలేదు. సీఎం రేవంత్ రెడ్డి గ్రాఫ్ పడిపోతోంది. మాజీ సీఎం కేసీఆర్ పక్కన ఉన్న దొంగలే రేవంత్ రెడ్డి పక్కనా ఉన్నారు. రేవంత్ రెడ్డిని కేసీఆర్ జైలులో వేస్తే.. రేవంత్ కనీసం ప్రయత్నం కూడా చేయడం లేదు. ప్రతిపక్షం ఫామ్‌హౌస్‌లో పడుకుంది. ప్రతిపక్ష పదవి ఎందుకు తీసుకున్నారు?కేసీఆర్ వ్యవస్థను విధ్వంసం చేసి దోచుకుతిన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి భయపెట్టిస్తున్నారు.. బుల్డోజర్లు పంపిస్తున్నారు. భాజపా నేతలను తెలంగాణలో కాళ్లు పెట్టనివ్వనని రేవంత్ రెడ్డి అహ్మదాబాద్‌లో అన్నారు. లేటెస్టుగా మల్క కొమురయ్య, అంజిరెడ్డి కాళ్లు పెట్టారు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసి దిల్లీకి పంపడం తప్పితే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్ కుటుంబం మీద చర్యలు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డిని మార్చాలని అధిష్ఠానం చూస్తోంది" అని అర్వింద్ పేర్కొన్నారు.

## కేసీఆర్ ప్రభుత్వం వేల ఎకరాలను తన వారికి కట్టబెట్టింది: మహేశ్‌కుమార్‌గౌడ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పదేళ్ల పాలనలో గత భారాస ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వేల ఎకరాలను తన వారికి కట్టబెట్టిందని విమర్శించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు.

"గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న వేల ఎకరాలను కేసీఆర్.. తన వారికి అప్పనంగా అమ్ముకున్నారు. కంచ గచ్చిబౌలి భూముల గురించి పదేళ్లలో ఎందుకు పోరాడలేదు. హెచ్‌సీయూ భూములైతే.. కోర్టు వివాదంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదు? ఐఎంజీ సంస్థ బిల్లీరావుతో కమీషన్ మాట్లాడుకొని భూముల గరించి పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి 400 ఎకరాలను సాధించాం. ఈ ప్రభుత్వం కాపాడకుంటే 400 ఎకరాల భూమి ఐఎంజీ చేతికి వెళ్లి ఉండేది. బిల్లీరావుతో మాట్లాడుకున్న రూ. వేల కోట్ల కమీషన్ పోయిందనే అక్కసుతోనే కేటీఆర్ మాట్లాడుతున్నారు.

ఏ ప్రభుత్వం అయినా ఒక సంస్థ ద్వారానే రుణాలు సేకరిస్తుంది. కోకాపేటలో వేల ఎకాలను రూ.100 కోట్లకు ఎకరం చొప్పున అమ్ముకోలేదా? టీజీఐఐసీ ద్వారా తీసుకున్న రూ.10వేల కోట్ల రుణాలతో రైతులకు రుణమాఫీ చేసింది ఈ ప్రభుత్వం. భారాస ప్రభుత్వం వేల ఎకరాలు అమ్ముకున్నప్పుడు పర్యావరణం గుర్తుకురాలేదా? పదేళ్లలో లక్ష ఎకరాలను డీఫారెస్ట్ చేసి అమ్ముకున్నారు. 400 ఎకరాల భూముల్లో కంపెనీలు నిర్మిస్తే.. రాష్ట్ర ప్రజలకు లక్షల ఉద్యోగాలు వస్తాయి. పదేళ్లలో భారాస చేసిన భూదోపిడీపై బహిరంగ చర్చకు కేటీఆర్ సిద్ధమా?" అని మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు.

## ఆర్‌టీఈ అమలుపై అఫిడవిట్ దాఖలు చేయండి.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

ఆర్‌టీఈ వచ్చి 16 ఏళ్లు గడుస్తున్నా విద్యార్థులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యాహక్కు చట్టం అమలులో ఉందని గుర్తుచేశారు. దీని ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని పిటిషనర్ కోరారు.మరోవైపు గతేడాది అక్టోబర్‌లో విద్యాహక్కు చట్టంపై హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమల్లోకి తెస్తామని అందులో పేర్కొంది. దీని అమలుకు సంబంధించిన పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

## 14 X 14 అడుగుల సెల్.. 24 గంటల నిఘా: తహవ్వుర్ రాణాను ఎక్కడ ఉంచారంటే..?

ముంబయి ఉగ్రదాడి కుట్రదారు తహవ్వుర్ రాణా ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ కస్టడీలో ఉన్నాడు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. నిరంతర నిఘా ఏర్పాటు చేసి అతడి కదలికలను దర్యాప్తు సంస్థ అధికారులు గమనిస్తున్నారు. తమ జ్యుడిషియల్ కస్టడీలో అతడి నుంచి కీలక విషయాలు సేకరించనున్నారు. ఈ క్రమంలో అతడిని ఎక్కడ, ఎలాంటి ఏర్పాట్ల మధ్య ఉంచారంటే..? తహవ్వుర్ రాణాను ఎన్ఐఏకు అప్పగించడంతో దిల్లీలోని సీజీఓ కాంప్లెక్స్ ప్రాంతమంతా కట్టుదిట్ట భద్రతలోకి వెళ్లిపోయింది. భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎందుకంటే ఆ కాంప్లెక్స్‌లోనే ఎన్ఐఏ భవనం ఉంది. దాని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న గదిలో ఇప్పుడు రాణాను ఉంచారు. 14 X 14 అడుగుల వైశాల్యంలో ఒక చిన్న గదిలో 24 గంటల నిఘా కోసం సీసీ కెమెరాలు అమర్చారు. ఆ గదిలో వివిధ అంచెల్లో డిజిటల్ సెక్యూరిటీ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. అతడు పడుకోవడానికి నేలపై బెడ్ వేశారు. ఆ రూమ్‌లోనే బాత్రూమ్ ఏర్పాటు ఉంది. ఆహారం, తాగునీరు, వైద్యసదుపాయాలు అన్నీ ఆ గదికే వస్తాయని తెలుస్తోంది. అనుమతి లేకుండా ఎవరు లోపలికి వెళ్లడానికి లేదు. కేవలం 12 మంది ఎన్ఐఏ అధికారులకు మాత్రం అనుమతి ఇచ్చారు.భారత్‌లో తహవ్వుర్ రాణా.. అప్పగింత తొలి ఫొటో విడుదలముంబయి ఉగ్రదాడి కేసులో నిందితుడిగా ఉన్న తహవ్వుర్ రాణాను భారత్ విజయవంతంగా అమెరికా నుంచి తీసుకురాగలిగింది. గురువారం అర్ధరాత్రి రాణాను ఎన్ఐఏ అధికారులు దిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు ప్రత్యేక జడ్జి ఎదుట హాజరుపర్చారు. ఆ సమయంలో ఈ కేసుతో సంబంధం లేని వ్యక్తులందరినీ కోర్టు నుంచి బయటకు పంపేశారు. సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ ఎన్ఐఏ తరఫున కోర్టులో వాదనలను వినిపించారు. రాణా తరఫున దిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది పీయూష్ సచ్‌దేవా వాదించారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి చందర్‌జిత్ సింగ్ వాదనలు విన్నారు. రాణాను 20 రోజుల పాటు తమ కస్టడీకి అనుమతించాలని ఎన్ఐఏ కోరగా.. 18 రోజుల కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. ప్రస్తుతం అధికారులు అతడిని ప్రశ్నిస్తున్నారు.

## శ్రీశైలం జల దోపిడి...

### చెన్నై తాగునీటి ముసుగులో ఏపీ కుట్ర

మొదటిపేజీ తరువాయి

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మరిన్ని నీళ్లు దోచుకునేందుకు ఏపీ లైన్? క్లియర్ చేసుకుంటున్నది. ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ కెపాసిటీని లక్షన్నర క్యూసెక్కులకు పెంచుకున్న పొరుగు రాష్ట్రం.. దాని కింద నిర్మించిన శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ (ఎస్ఆర్ఎంసీ) ద్వారా పూర్తి స్థాయిలో నీటిని తరలించుకుపోయేందుకు వీలుగా వారం నుంచి లైనింగ్ పనులను స్పీడప్ చేసింది. ఇప్పటివరకు లైనింగ్ లేని ఈ కెనాల్ ద్వారా కేవలం 44 వేల క్యూసెక్కులనే తరలించే వీలుండగా.. రెండు, మూడు నెలల్లో లైనింగ్ పూర్తి చేయడం ద్వారా రోజూ 90 వేల క్యూసెక్కుల (8 టీఎంసీలు) చొప్పున తన్నుకుపోయేలా కుట్ర చేస్తున్నది. ట్రిబ్యునల్‌లో కేసు నడుస్తున్నా, ఇరిగేషన్ అవసరాలకు నీళ్లను ఔట్ సైడ్‌బేసిన్‌కు తరలించడానికి వీల్లేదని బచావత్‌ట్రిబ్యునల్ అవార్డు చెబుతున్నా.. ఏపీ అవేవీ లెక్క చేయకుండా ముందుకెళ్తున్నది. నాడు 1,500 క్యూసెక్కులకే అనుమతి..

శ్రీశైలం ప్రాజెక్టును కేవలం విద్యుదుత్పత్తి కోసమే వాడాలని 1973లో బచావత్ ట్రిబ్యునల్‌స్పష్టంగా చెప్పింది. హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ కాబట్టి.. నీటిని ఇరిగేషన్ అవసరాల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ వాడడానికి వీల్లేదని ఆదేశించింది. అది కూడా ఔట్‌సైడ్ బేసిన్‌లోని ఇరిగేషన్‌అవసరాలకు తరలించకూడదని పేర్కొంది. ఒకవేళ తరలించాల్సి వస్తే కేవలం ఇన్‌సైడ్ బేసిన్‌కే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ క్రమంలో 1977 అక్టోబర్ 28న జరిగిన అగ్రిమెంట్‌ప్రకారం.. చెన్నై తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఒక వాటర్‌ఇయర్‌లో 15 టీఎంసీలకు మించకుండా 1,500 క్యూసెక్కులతో కాల్వలను డిజైన్ చేయించాలని సూచించింది. కానీ, చెన్నైకి తాగునీటి ముసుగులో ఏపీ పాలకులు ఔట్‌సైడ్ బేసిన్ అయిన పెన్నా బేసిన్‌లోని రాయలసీమ ప్రాంతానికి నీటిని తరలించే కుట్రకు తెర లేపారు.

1980లలో మొదలైన ఆ జల దోపిడీ.. ఆ తర్వాత మరింత పెరిగి, ప్రస్తుతం రోజూ 8 టీఎంసీలు తరలించే స్థాయికి చేరింది. ఏపీ పాలకులు 1980లలో 44,600 క్యూసెక్కుల కెపాసిటీతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, 19,150 క్యూసెక్కుల సామర్థ్యంతో శ్రీశైలం రైట్‌మెయిన్ కెనాల్(అన్‌లైన్డ్), 48,525 క్యూసెక్కుల సామర్థ్యంతో బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టారు. 2005లో పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 1,56,100 క్యూసెక్కులకు, ఎస్ఆర్ఎంసీ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 81,975 క్యూసెక్కులకు పెంచారు. 2020లో ఎస్ఆర్ఎంసీ కెపాసిటీని 89,762 క్యూసెక్కులకు పెంచేలా లైనింగ్‌పనులను చేపట్టేందుకు ఏపీ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఏడాది మే 5న జీవో 203 ఇచ్చింది. ఇప్పుడు ఆ పనులను స్పీడప్‌చేస్తోంది.

## వేసవి రద్దీ.. తిరుపతికి 14 ప్రత్యేక రైళ్లు.. వివరాలివే..!

మొదటిపేజీ తరువాయి

వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. తిరుపతి -మచిలీపట్నం- తిరుపతి మధ్య 14 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 13 నుంచి మే 25 వరకు ప్రతి ఆదివారం తిరుపతి- మచిలీపట్నం రైలు (07121)బీ ఏప్రిల్ 14వ తేదీ నుంచి మే 26వరకు ప్రతి సోమవారం మచిలీపట్నం- తిరుపతి (07122) మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి.

### ఏపీ ఇంటర్ ఫలితాలు రేపే.. సులభంగా పొందొచ్చు ఇలా!

తిరుపతి-మచిలీపట్నం ప్రత్యేక రైలు (07121) ప్రతి ఆదివారం రాత్రి 10.20 గంటలకు తిరుపతిలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు మచిలీపట్నం చేరుకోనుంది. అలాగే, మచిలీపట్నం-తిరుపతి ప్రత్యేక రైలు (07122) ప్రతి సోమవారం సాయంత్రం 5.40 గంటలకు మచిలీపట్నంలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.20 గంటలకు తిరుపతికి చేరుకోనుంది. ఇరువైపులా రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, పెడన స్టేషన్లలో ఆగే ఈ ప్రత్యేక రైళ్లలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్‌తో పాటు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

### చర్లపల్లి-శ్రీకాకుళం ప్రత్యేక రైళ్ల వేళలివే..

అలాగే, చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్డు మధ్య మొత్తం 24 సర్వీసులు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఏప్రిల్ 11 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్డు రైలు (07025)బీ ఏప్రిల్ 12వ తేదీ నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం శ్రీకాకుళం రోడ్డు- చర్లపల్లి (07026) మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. చర్లపల్లిలో ప్రతి శుక్రవారం రాత్రి 9.15 గంటలకు బయల్దేరనున్న రైలు (07025) మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. అలాగే, ప్రతి శనివారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరనున్న రైలు (07026) మరుసటి రోజు ఉదయాన్నే 6 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఇరువైపులా నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురపల్లి స్టేషన్లలో ఈ రైలు ఆగుతాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

## కంచ గచ్చిబౌలి భూ కుంభకోణం సూత్రధారి, పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి



సుప్రీం కోర్టు తీర్పుల ప్రకారం ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని మోడీ ఆరోపించారు కానీ ఇప్పటిదాకా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అమృత్ స్కాంలో రేవంత్ రెడ్డి బావమరిదికి రూ. 1137 కోట్ల రూపాయలు దారి మళ్లించాడని ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే ఇప్పటిదాకా ఎలాంటి చర్య తీసుకోలేదు. రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీద ఈడీ దాడులు జరిగితే ఇప్పటిదాకా అధికార ప్రకటన రాలేదు. ఈ వ్యవహారాన్ని ఈ ఆర్థిక మోసాన్ని కూడా అదే కోవలో కలిపేసి కాంగ్రెస్ బీజేపీ ఒకరినొకరు కాపాడుకుంటారో.. లేదంటే నిజంగానే సమగ్ర విచారణకు ఆదేశించి మేము నిజాయితీగా ఉన్నాం, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఈ దోపిడీని ఉపేక్షించమని చెప్పి కేంద్రం తన చిత్తశుద్ధిని చాటుకోవాలి. దొంగ చేతికి నేను ఇప్పుడే తాళాలు ఎందుకని ఆ బీజేపీ ఎంపీ పేరు చెప్పడం లేదు అని కేటీఆర్ తెలిపారు. ఈ దేశంలో సామాన్యుడు బ్యాంకు లోన్ తీసుకోవాలంటే 100 డాక్యుమెంట్స్‌ని వెరిఫై చేసి 100 కొర్రీలు పెట్టి లోన్ ఇస్తారు. అదే ఒక సంపన్నుడు అధికారపక్షంతో అనుబంధం ఉన్నవాడు లోన్ అడిగితే నిమిషాల్లోనే మంజూరు చేస్తారు. కనీసం భూమి ఉందో లేదో కూడా చెక్ చేయరు ఇక్కడ అదే జరిగింది. ఐసిఐసిఐ లాంటి దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు, భూ యాజమాన్య హక్కును పరిశీలించకుండానే ఆ భూమి ఎవరిదో తెలుసుకోకుండానే పదివేల కోట్లు లోన్ ఇవ్వడం ఆశ్చర్యం. ఈ భూ కుంభకోణం కర్త కర్మ క్రియ సూత్రధారి పాత్రధారి అంతా రేవంత్ రెడ్డినే. ఇన్ని క్లూస్ ఇచ్చాక జర్నలిస్టులు ఇన్వెస్టిగేషన్ చేయాలి అని కేటీఆర్ సూచించారు.

## నేతకాని సంఘం ఆధ్వర్యంలో మేజర్ మీనాక్షికి ఘన సన్మానం

**కరపత్రం ఏప్రిల్ 11 (మంచిర్యాల బ్యూరో):–**






జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఆకుదారి మీనాక్షి గ్రేస్ భారత సైన్యంలో కెప్టెన్ నుండి మేజర్ పదవికి పదోన్నతి పొందడం గర్వకారణమని నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్, జిల్లా అధ్యక్షుడు సునర్కార్ రాంబాబు లు తెలిపారు. శుక్రవారం ఆమె స్వగృహంలో నేతకాని సంఘం ఆధ్వర్యంలో ఆమెను శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, నేతకాని జాతి బిడ్డకు దక్కిన గౌరవానికి, గ్రామస్థాయి నుంచి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ మీనాక్షి గ్రేస్ కుటుంబ సభ్యులు, సంఘం నాయకులు అనపర్తి యువరాజ్, కొండగొర్ల శ్రీనివాస్, దుర్గం లింగన్న, జుమ్మిడి లక్ష్మీ, జాడి లక్ష్మీ లు పాల్గొన్నారు.

## ఎందరో మహానుభావులకు పూలే స్ఫూర్తి




**కరపత్రం ఏప్రిల్ 11 (మంచిర్యాల బ్యూరో):–**
మహాత్మ జ్యోతిరావు పూలే ఎందరో మహానుభావులకు స్ఫూర్తి అని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది డాక్టర్ రాజలింగు మోతె తెలిపారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం రాజలింగు మోతె మాట్లాడాతూ, దేశ పురోభివృద్ధికి ప్రతిబంధకాలు అయిన అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, నిచ్చెనమెట్ల కులవ్యవస్థ రూపుమాపడానికి, అసమానతలు లేని సమాజాన్ని రెండు వందల సంవత్సరాల కిందట మహాత్మా జ్యోతిరావు పూలే ఆకాంక్షించారన్నారు. సామాజిక న్యాయం, విద్య, సమానత్వంకోసం చివరి దాకా పూలే పోరాడారని తెలిపారు. దేశంలో అసమానతలు లేని సమాజం వచ్చినప్పుడు, రాజకీయ ప్రాతినిధ్యం లేని కులాలు అందలమెక్కినప్పుడు, ఆయన పోరాటానికి సార్థకత ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో చిన్నారులు శ్రీ తీర్థ, సాయి ధరమ్ తేజ్, హిమదీక్షిత్, శివ, కపిల్ లు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 14 లోగా అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేయాలి

### – జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**కరపత్రం ఏప్రిల్ 11 (మంచిర్యాల బ్యూరో):–**





ఏప్రిల్ 14 లోగా భారత రాజ్యాంగ నిర్మాత డా, బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో కొనసాగుతున్న డా, బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డా, బిఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ నెల 14వ తేదీన డా, బిఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా విగ్రహ ఏర్పాటు పనులు వేగవంతం చేసి ఈ నెల 14వ తేదీన ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

### – రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, ఐపిఎస్, డిఐజి

**కరపత్రం ఏప్రిల్ 11 (మంచిర్యాల బ్యూరో):–**



పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదులపై పోలీస్ సిబ్బంది తక్షణమే స్పందించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపిఎస్, డిఐజి తెలిపారు శుక్రవారం ఆయన జిల్లాలోని బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా స్టేషన్ పరిసరాలు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించి ఇలాంటి ఫిర్యాదులు వస్తున్నాయని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, ఐపీఎస్, బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సిఐ సయ్యద్ అఫ్జలూద్దీన్, తాండూరు సిఐ కుమారస్వామి, బెల్లంపల్లి 2టౌన్ ఎస్ఐ మహేందర్ లు పాల్గొన్నారు.

## "శాంతియుతంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు": కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్

**– హనుమాన్ జయంతి ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించిన కమిషనర్**

కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి




రేపు జరగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లు, మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపిఎస్ రాచకొండ డీసీపీలు, ఏసిపిలు మరియు ఇతర అధికారులతో నేరెడ్ మెట్ లోని రాచకొండ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాచకొండ కమిషనరేట్ పరిధిలో హనుమాన్ జయంతి ఉత్సవాల సమయంలో మత సామరస్యం కాపాడేలా, ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనే శోభాయాత్ర సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, తమ పరిధిలో మతసామరస్యానికి కృషి చేస్తున్న వివిధ వర్గాల మతపెద్దలు మరియు శాంతి కమిటీ సభ్యుల సహకారంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాచకొండ పరిధిలోని సున్నితమైన ప్రదేశాలలో ఉత్సవాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతియుతంగా ఊరేగింపులు జరిగేలా చూడాలని సూచించారు. ట్రాఫిక్ విభాగపు అధికారులు మరియు సిబ్బంది శోభాయాత్ర ఊరేగింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల నంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని, అవసరమైన ప్రదేశాల్లో బాంబు తనిఖీ బృందాల ద్వారా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఊరేగింపుల్లో పాల్గొనే సమయంలో మహిళలు ఎటువంటి వేధింపులకు గురికాకుండా షి టీమ్స్ బృందాలు ఎల్లవేళలా విధుల్లో ఉండాలని సూచించారు. భక్తులు సంతోషంగా, శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని కమిషనర్ కోరారు. మతసామరస్యానికి భంగం కలిగించే చర్యలను పోలీసు శాఖ ఉపేక్షించబోదని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిసిపి అడ్మిన్ ఇందిర, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ నరసింహా రెడ్డి, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, సీసీఆర్బి ఏసిపి రమేష్ , ఎస్బి ఏసిపి రవీందర్ రెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఖని బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా తౌటం సతీష్, ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



గోదావరిఖని భార్ అసోసియేషన్ అధ్యక్షులుగా తౌటం సతీష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దేశెట్టి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సంజయ్ కుమార్, కోశాధికారిగా మహ్మద్ ఉమర్, సంయుక్త కార్యదర్శిగా మచ్చ కుర్తి కుమార్, లైబ్రరీ సెక్రటరీగా పేరుక మనోహర్, స్పోర్ట్స్ సెక్రటరీ ఎరుకల ప్రదీప్ కుమార్, లేడీ రిప్రజెంటీటివ్ గా భారతి చౌహన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ (30 సంవత్సరాలు) డి.గోపాల్ రెడ్డి (20 సంవత్సరాలు) ఉమెన్ ఎగ్జిక్యూటివ్ గా ఇ.శోభరాణి, జూనియర్ ఎగ్జిక్యూటివ్ గా పులిపాక రాజ్ కుమార్, రాగం శ్రీధర్, గాదె శ్రీలత, తబస్సుమ్ ఎన్నికయ్యారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ కు ఎన్నికలు శుక్రవారం జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి పోటీ చేసిన తౌటం సతీష్ కు 71 ఓట్లు రాగా బల్మూరి అమరేందర్ రావుకు 59 ఓట్లు వచ్చాయి. దాంతో సతీష్ 12 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా పోటీచేసిన సంజయ్ కుమార్ కు 90 ఓటు రాగా శీతకారి చంద్రశేఖర్ కు 59 ఓట్లు వచ్చాయి. సంజయ్ కుమార్ 31 ఓట్ల మెజారిటీతో గెలిచారు. కోశాధికారిగా పోటీ చేసిన ఎండి. ఉమర్ కు 103 ఓట్లు రాగా కే .వెంకటేశంకు 96 ఓట్లు వచ్చాయి. దాంతో ఉమర్ 7 ఓట్ల తేడాతో గెలిచారు.

## అసమానతలను తొలగించేందుకు విశిష్ట కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిభాపూలే







### – జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**కరపత్రం ఏప్రిల్ 11 (మంచిర్యాల బ్యూరో):–**
సమాజంలో అసమానతలను తొలగించడంతో పాటు బాలికా విద్యను ప్రోత్సహించి మహిళలకు సమాన అవకాశాల కొరకు పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిభాపూలే అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిభాపూలే 198వ జయంతి వేడుకలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ పురుషోత్తం, జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై పూలే చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి, పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బడుగు, బలహీన, దళిత, గిరిజన ప్రజల సంక్షేమం కోసం, మహిళలు చదువు నేర్చుకోవాలనే సంకల్పంతో విశిష్ట కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే ఆచరించిన ఆశయాలను అందరం కొనసాగించాలని అన్నారు. బాలికా విద్యను ప్రోత్సహిస్తూ మహిళలు చదువుకున్నట్లయితే కుటుంబంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మహిళల సమానత్వం కొరకు కృషి చేశారని తెలిపారు. ఆ కాలంలో బాలికా విద్య కోసం ముందుగా తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అణిచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సమాజంలో సమాన స్థానం అందించేందుకు తమ జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. కుల వివక్ష, అసమానతలను అంతం చేయాలని ఆనాడే నిర్ణయించుకుని పోరాటాలు చేశారని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించి సన్మార్గంలో నడిచేలా అందరం సమిష్టిగా కృషి చేయాలని, మహాత్మా జ్యోతిభాపూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

**కరపత్రం మందమర్రి ఏప్రిల్ 11:–**



ప్రతి ఒక్కరూ మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని, ముందుకు సాగాలని సింగరేణి ఏరియా జిఎం జి దేవేందర్ తెలిపారు. పట్టణంలోని సింగరేణి గ్రీన్ పార్క్ ఎదుట శుక్రవారం నిర్వహించిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏరియా జిఎం జి దేవేందర్ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే తన జీవితాంతం సమాజం కోసం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేశారని, తన జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మహనీయుల ఆశయాలు ముందుకు తీసుకుపోవాలంటే కేవలం చదువుతూనే సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ మంచిగా చదివి, జీవితంలో బాగుపడినప్పుడే వారికి నిజమైన నివాళులు అని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వరరావు మాట్లాడుతూ, బీసీలు ఐక్యంగా ఉండాలని, అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ కుమార్ ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సింగరేణి అధికారులు, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శనివారం ఏప్రిల్ 12 2025

## అనగారినవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహానీయుడు జ్యోతిబా పూలే...



**- టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్...**

**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 11**
అన గారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు, జ్యోతిబాపూలే టిపిసిసి మెంబర్ మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. సంఘసంస్కర్త సమకాలిక సామాజిక రుగ్మతులను కుల వివక్ష భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేసి బాలికల విద్య శ్రీ హక్కులు వితంతు పునర్వివాహానికి కృషిచేసిన మహనీయుడని బలహీన వర్గాల న్యాయం కోసం సాధికారిక కోసం పరితపించిన సాంఘిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప మాట్లాడుతూ మహిళలకు బడుగు బలహీన వర్గాలకు అగ్రవర్ణ పేదలకు చదువు నందించిన గొప్ప మహనీయుడని జ్యోతిబాపూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ పార్థసారథి, ఆర్ ఐ బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు చింతిరెడ్డి పద్మ, ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గుల్ల రాజు, కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి పవన్, మానకొండూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహమ్మద్ షారుక్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, గొడిశాల ప్రవీణ్, సంపత్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## జిఎం కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఆర్జి 1 ఏరియా జీఎం కార్యలయం మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జి 1 ఏరియా జి.ఎం డి.లలిత్ కుమార్ హాజరు అయి మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిఎం మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడెట్కన జ్యోతీరావ్ గోవిందరావ్ ఫులే మహారాష్ట్ర లోని సతారా జిల్లాలోని మాలి కులానికి చెందిన కుటుంబంలో 1827 ఏప్రిల్ 11న జన్మించాడని, వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పూలే చేసిన కృషిని స్పూర్తిగా తీసుకుని వారి ఆశయాల సాధనకై బీసీ సోదరులు ఐఖ్యంగా ఉండాలని తెలిపారు. సింగరేణి అద్వర్యంలో ఏరియాలోని అన్ని గనులు మరియు డిపార్ట్ మెంట్ లలో బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు మహాత్మా జ్యోతీరావు పూలె జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, పెరుమాళ్ళ శ్రీనివాస్ బిసి లైజన్ అధికారి, గుర్తింపు యునియన్ నాయకులు రంగు శ్రీనివాస్, యస్ఓటు జిఎం గోపాల్ సింగ్, అధికారుల సంఘం వర వరప్రసాద్, మల్లేష్, అధికారులు వెంకటేశ్వర్ రావు, ఆంజనేయ ప్రసాద్, కుమార స్వామి, ధనలక్ష్మి బాయి, మోహన్ రావు, జితేందర్ సింగ్, వీరా రెడ్డి, సాంబ శివరావు, బీమా, సీనియర్ పిఓ హనుమంత రావు, పిఓఏ వూట్ల దేవాచారి, ఇతర అధికారులు ఉన్నారు.

## కల్వాల లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు...

**- 200 లీటర్ల బెల్లం పానకం,2 లీటర్ల నాటు సారా పట్టివేత...**
**- వ్యక్తిపై కేసు నమోదు... చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు...**

**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 11**



నిషేధిత నాటుసార తయారు చేస్తున్నట్లు పూర్తి సమాచారం మేరకు కల్వలలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మాట్లాడారు . కరీంనగర్ ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ పి శ్రీనివాసరావు ఆదేశం మేరకు కే నాగేశ్వరరావు టాస్కోర్స్ సిఐ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం కల్వల గ్రామంలో నిషేధిత నాటు సారా తయారు చేస్తున్నట్లు టార్ స్కోర్స్ పోలీసులు పూర్తి సమాచారాన్ని సేకరించి, శుక్రవారం టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా కల్వల శివారులో వ్యవసాయ పొలాలలో శివరాత్రి మల్లయ్య అనే వ్యక్తి నాటుసార తయారు చేస్తున్నాడని తమ తనిఖీల్లో వెల్లడైందని, శివరాత్రి మల్లయ్య పై కేసు నమోదు చేసి,2 లీటర్ల నాటు సారా, 200 లీటర్ల నాటు సారాకు వినియోగించే బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీస్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# పూలే మార్గం అందరికీ అనుసరణీయం

## - యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జమ్మికుంట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ పూలే సేవలను కొనియాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్త్రీల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు మహనీయుడు పూలే కృషిచేశారని తెలిపారు. తొలి బాలికల పాఠశాలను ప్రారంభించిన విద్యావేత్త పూలే అని అభివర్ణించారు. సమ సమాజ స్థాపనే జ్యోతిరావు పూలే లక్ష్యమని చెప్పారు.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 11**



మహాత్మా జ్యోతిరావు పూలే త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని అన్నారు. ఆ మహానీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నామని చెప్పారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. సమసమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోబీ యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్య, తెలంగాణ ఉద్యమకారులు అన్నం ప్రవీణ్, ఫిషరీస్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాతకాల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శి యేబుషి అజయ్, దొడ్డ నవీన్, పాతకాల ప్రవీణ్, రాజ్ కుమార్, పచ్చిమట్ల భాను, జావిద్, అస్రఫ్, సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అమలుపై సన్నాహక సమావేశం...

**కరపత్రం ,శంకరపట్నం ఏప్రిల్ 11**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ పల్లి సత్యనారాయణ శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే అన్ వీల్స్ వాహనం నిర్వహణపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈనెలలో అంబేద్కర్ జయంతి న ప్రారంభించనున్న ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం అమలుపై క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూరు నియోజకవర్గం లోని 6 మండలాల మండల శాఖ అధికారులైన, ఎంపీడీవోలు, తహసీల్దార్లతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల చెంతకే వెళ్లి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నఉద్దేశంతో చేపట్టిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు



తోడ్పాటునందించాలని కోరారు. గ్రామ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయానికి ప్రత్యేకమైన యాప్ ను రూపొందిచామని, ఈ యాప్ ద్వారా ప్రజల నుంచి వచ్చే విన్నపాలను పరిష్కరించేందుకు రోజుకు 3 గ్రామాలకు ప్రత్యకంగా తయారు చేయించిన వాహనంలో అధికారులతో కలిసి వెళ్లడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు యాప్ ద్వారా తెలియజేసిన సమస్యల గురించి తెలుసుకొని అప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలన్నదే ఈ ఎమ్మెల్యే ఆన్ వీల్స్ వాహన, కార్యక్రమం ఉద్దేశమన్నారు. మంచి ఉద్దేశంతో చేపట్టే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని, సమస్యల పరిష్కరించేందుకు పాటుపడాలని, ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇంజినీర్లు రవి ప్రకాశ్, మంజులా భార్గవి, తహశీల్దార్లు కె.వరలక్ష్మి, బత్తుల భాస్కర్, విజయ్ కుమార్, ఎంపీడీవోలు విజయ్ కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, వై.శశికళ, డిప్యూటీ తహసీల్దార్లు సమ్మయ్య, నర్సింహచారి, గోపాల్, సత్యనారాయణ, ఏఈలు సురేందర్ రెడ్డి, స్నేహజ్యోతి, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్, సంతోష్ తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఆర్జి 1 ఏరియాలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించాలి

**- ఆర్జి 1 ఏరియా జీఎం డి.లలిత్ కుమార్**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ 134వ జన్మదినం పురస్కరించు కొని ఆర్జి 1 ఏరియా జీఎం కార్యాలయం వద్ద నిర్వహించు జయంతి వేడుకల ఏర్పాట్లకు సంబందించి ఆర్జి 1 ఏరియా జియం డి.లలిత్ కుమార్ అధికారులు, ఎస్.సి, ఎస్.టి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జన్మదినం పురస్కరించు ఆర్జి 1 ఎస్.సి, ఎస్.టి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమన్వయంతో నిర్వహించు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని తెలిపారు. జీయం కార్యలయం దగ్గర అంబేద్కర్ విగ్రహానికి పూల మాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని జీఎం తెలిపారు. ఇందుకు సంబందించి అంబేద్కర్ విగ్రహానికి పూలతో, డెకరేషన్, లైటింగ్, షామియానాలు, త్రాగు నీరు, మైక్ సెట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంటేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని జీఎం తెలిపారు. అంబేద్కర్ జయంతి వేడుకలను అభ్యుదయ కళా సంఘాలు, స్థానిక ప్రజలు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవతం చేయగలరని జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జీయం గోపాల్ సింగ్, ఏరియా ఇంజనీర్ డి.వి. రావు, డిజీఎం ఏరియా వర్క్ షాప్ జితేందర్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, ఎస్.ఈ సివిల్ వర ప్రసాద్, సియం ఓ ఏ అధికారి కోలా మల్లేష్, బిసి లైజన్ పెరుమాళ్ళ శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పి.వో హనుమంతరావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్.సి లైజన్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు, ఎస్.సి&ఎస్.టి అసోసియేషన్ నాయకులు, ఈర్ల రాజేష్, జనగామ నర్సయ్య, పులి మోహన్, గంగారపు లింగమూర్తి, అరేపెల్లి రాంచదర్, ఆరెల్లి హరీష్, మేదరి కుమార్, తిరుపతి, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జి.డి.కే ఓసి 5లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ మహొత్సవం


**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జిడికే ఓసి 5లో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ అవిష్కరణ మహొత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్.కృష్ణయ్య, ఎం.పి రాజ్యసభ, బీసీ ఉద్యమ నాయకులు, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, అర్జీ 1 జిఎం డి.లలిత్ కుమార్, పంజాల శ్రీనివాస్ ఎస్.బిసిఈఎ ఫౌండర్, ఎస్.బిసిఈఎ ప్రసిడెంట్ వసంత్ కుమార్ హాజరు అయి వారి చేతుల మీదుగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ చేశారు. ముఖ్య అతిథులు ఆర్.కృష్ణయ్య ఎం.పి రాజ్య సభ మాట్లాడతూ జ్యోతీరావు గోవిందరావ్ పూలే సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పూలే చేసిన కృషిని స్పూర్తిగా తీసుకుని వారి ఆశయాల సాధనకై బీసీ సోదరులమంతా ఎల్లవేలలా సిద్దంగా ఉంటామని ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ళ శ్రీనివాస్ బిసి లైజన్ అధికారి, పిఒ చంద్ర శేఖర్, ఎస్.ఓ.ఎం అనిల్ గబాలే, దిటి చంద్ర మౌళి, మల్లేశం, జనరల్ సెక్రటరి వూట్ల దేవా చారి, ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, యునియన్ నాయకులు సదానందం, రాజి రెడ్డి, యాదగిరి సత్తయ్య, కయ్యుం, వడ్డేపల్లి శంకర్, మోహన్, పెంచాల తిరుపతి, గుర్రం ప్రభుదాస్, నాయకులు మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, ఎసిపి మడత రమేష్, మెందె రమేష్, బిసి పిట్ సెక్రటరి చిందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి దర్శించి మొక్కు తీర్చుకున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
గోదావరిఖని మార్కండేయ కాలనీ లో గౌడ సంఘం ఆద్వర్యంలో నూతనంగా నిర్మించబడిన ఎల్లమ్మ గుడిని శుక్రవారం రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య సందర్శించి ఎల్లమ్మ తల్లిని దర్శించికొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇంత పెద్ద ఎల్లమ్మ గుడి నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు.



రామగుండం బీసీ యువజన సంఘం అధ్యక్షులు గున్నాల శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఆలయ కమిటి చైర్మన్ మేరుగు హనుమంతు గౌడ్, బాలసాని స్వామి గౌడ్, కోట రవి గౌడ్, సురేందర్ గౌడ్, సిరిశెట్టి తిరుపతి గౌడ్, బిందె నాగభూషణం, మాచిడి మహేందర్ గౌడ్, ఆంజనేయులు జనార్దన్ గౌడ్, మడ్డి శ్రీనివాస్, సంతోష్ గౌడ్, గౌడ్ విక్రం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత యువజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమతా ర్యాలీ

**- మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, దళిత సంఘాల నాయకులు గుమ్మడి కుమారస్వామి**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**




డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రామగుండం నియోజకవర్గ దళిత యువజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమతా ర్యాలీ నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, దళిత సంఘాల నాయకులు గుమ్మడి కుమారస్వామి తెలిపారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దళితుల ఐక్యతను చాటి చెప్పడానికి ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్ చౌరస్తా నుండి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం చౌరస్తాలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, అంబేద్కర్ ఆలోచన విధానాలను నేటి తరానికి తెలియజెప్పేలా కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. రాజ్యాంగంలో రూపొందించిన రాజ్యాంగ ఫలాలను దళితులకు చేరవేసే క్రమంలో ప్రభుత్వాలు దాటవేత ధోరణిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. దళితుల ఐక్యతను చాటుతూ ఈనెల 14 అంబేద్కర్ సమతా ర్యాలీలో మాల, మాదిగ, 59 ఉప కులాల ప్రజలు, పార్టీలకు అతీతంగా దళిత ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో దళిత యువజన ఐక్య వేదిక నాయకులు జెవి రాజు, పాముకుంట్ల భాస్కర్, రేణికుంట్ల ప్రీతం,చింటూ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.